బోనమో పోచమ్మ



వేములవాడ: రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. మండుతున్న ఎండల్లోనే నెత్తిన బోనాలతో చలువ పందిళ్ల కింద క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి అమ్మవారికి బోనం మొక్కు, కల్లుసాక చెల్లించుకున్నారు.



	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.29	5.01
పెద్దపల్లి :	6.32	5.00
సిరిసిల్ల :	6.27	5.09
జగిత్యాల :	6.33	4.59

న్యూస్‌రీల్

అప్రమత్తతతోనే అదుపులో శాంతిభద్రతలు

- ఎస్పీ మహేశ్ బి.గీతే
- తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



తంగళ్లపల్లిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్ బి.గీతే

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అధికారుల అప్రమత్తతతోనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని ఎస్పీ మహేశ్ బి.గీతే అన్నారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. సీజ్‌చేసిన వాహనాలు, స్టేషన్ రికార్డులు పరిశీలించి కేసులు త్వరగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. డయల్ 100, బ్లూకోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై రామ్మోహన్ ఉన్నారు.

ఒకే దేశం..ఒకే ఎన్నిక అవసరం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: పరిపాలన సామర్థ్యం పెంచేందుకు ఒకే దేశం.. ఒకే ఎన్నిక అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. సిరిసిల్ల మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడమే లక్ష్యమన్నారు. పార్టీ జిల్లా కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు చేపట్టాలి

- డీఆర్‌డీవో పీడీ శేషాద్రి



కోళ్ల ఫారమ్ పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ

చందుర్తి(వేములవాడ): ఉపాధిహామీ పనులు లక్ష్యం మేరకు పూర్తి చేయాలని డీఆర్డీవో శేషాద్రి కోరారు. మండలంలోని మర్రిగడ్డలో చేపట్టిన ఫీడర్‌చానల్, కోళ్ల ఫారం షెడ్ పనులను మంగళవారం పరిశీలించారు. కూలీల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. పనిచేసే చోట కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు. ఉపాధిహామీ ఏపీవో రాజయ్య, మర్రిగడ్డ గ్రామ కార్యదర్శి కవిత ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడఅర్బన్: 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ కోరారు. తహసీల్దార్ ఆఫీస్‌లో వివిధ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. కొత్త ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్, పార్టీల ప్రతినిధులు పొలాస నరేందర్, రాము, రామస్వామి తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతం చేయండి



కోనరావుపేట పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

కోనరావుపేట(వేములవాడ): వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి రజిత కోరారు. కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, ధర్మారంలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. మాతాశిశు, అసంక్రమిత వ్యాధుల కార్యక్రమాలపై సమీక్షించారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్, ప్రోగ్రాం అధికారులు అనిత, సంపత్, రామకృష్ణ, సూపర్‌వైజర్లు రషీద్, సువర్ణ, మెర్సీ ఉన్నారు.

అంతా స్వాహాకారమే

- 'సెస్'లో అవినీతిపై సభ్యుల ఆగ్రహం
- ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయాలని డిమాండ్
- పాలకవర్గాల అవినీతి, అక్రమాలతోనే సంస్థ పతనం
- విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణలో ఆవేదనలు'



విచారణలో పాల్గొన్న 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, పాలకవర్గ సభ్యులు, విద్యుత్ వినియోగదారులు

సిరిసిల్ల: యాభై ఏళ్ల క్రితం సిరిసిల్ల ప్రాంతంలో వెలుగులు నింపేందుకు ఏర్పాటు చేసిన సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో నేడు అంతా స్వాహాకారమే రాజ్యమేలుతోందని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సెస్' పాలకవర్గాల అవినీతి, అక్రమాలతో పాలన సాగిస్తున్నాయన్నారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో 'సెస్' 2025–2026 వార్షిక ఆదాయం సవరణపై మంగళవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్సీ) చైర్మన్ జస్టిస్ డాక్టర్ డి.నాగార్జున్ బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు, 'సెస్' గ్రామీణ ప్రతినిధులు పాల్గొని సంస్థ పని తీరును ఎండగట్టారు.

ఇంత నిర్లక్ష్యమా..

జిల్లాలో విద్యుత్ లూజ్ వైర్లతో రైతులు ట్రాక్టర్‌తో దున్నే పరిస్థితి లేదని, హార్వెస్టర్లతో వరికోతలు కోసేందుకు ఇబ్బందిగా మారిందని, మిడిల్ పోల్స్‌ను వేసి లూజ్ వైర్లను సరిచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ పంపిణీలో లైన్ లాస్ కేవలం 'సెస్' సిబ్బంది కనుసన్నల్లోనే విద్యుత్ చౌర్యం జరుగుతోందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే మరోటి వేయాలంటే ట్రాన్స్‌పోర్టు పేరిట రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన గ్రామాల్లో విద్యుత ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, వైర్లు ఇతర పరికరాలను దొంగచాటుగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. పవర్‌లూమ్స్‌కు విద్యుత్ సరఫరాలోనూ అక్రమాలు జరుగుతున్నాయన్నారు. బదిలీలు లేకుండా 20 ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోవడంతో అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ కంటే మెరుగైన విద్యుత్ పంపిణీ సేవలు అందిస్తున్నామన్నారు. 26 నెలల తమ పాలనలో రూ.11కోట్లు ఉన్న డిమాండ్‌ను రూ.22కోట్లకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి 5 హెచ్‌పీల వరకు విద్యుత్ ఉచితంగా ఉందని, కానీ ఎక్కువ మంది రైతులు 7.5 హెచ్‌పీలు, 10 హెచ్‌పీలు, 12.5 హెచ్‌పీలు, 15 హెచ్‌పీలు వినియోగిస్తుండడంతో విద్యుత్ లైన్‌లాస్ వస్తోందని వివరించారు. టారిఫ్ రేట్లను ప్రతీ యూనిట్‌కు పది పైసలు తగ్గించాలని, సభలో రాజకీయ కక్షలతో కొందరు అవినీతి ఆరోపణలు చేశారన్నారు. 'సెస్' ఎండీ విజయేందర్‌రెడ్డి ముందుగా 'సెస్' వార్షిక నివేదకను, విద్యుత్ కొనుగోలు, పంపిణీ లెక్కలను వివరించారు. సభలో సభ్యులు చెప్పిన అంశాలను, అవినీతి ఆరోపణలను నోట్ చేసుకున్నామని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. టీజీఈఆర్సీ మెంబర్ సెక్రటరీ వి.రామచందర్, 'సెస్' వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి రమాదేవి, మల్లుగారి రవీందర్‌రెడ్డి, సందుపట్ల అంజిరెడ్డి, వరుస కృష్ణహరి, కొట్టెపల్లి సుధాకర్, ఆకుల గంగారాజం, అకౌంట్స్ ఆఫీసర్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్

ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు



మా కొడుకు ప్రణీత్‌రెడ్డి 2023లో విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డాడు. మా ఇంటి పక్కనే వద్దనంగా విద్యుత్‌లైన్ వేశారు. కోతులను కొట్టేందుకు ఇంటిపైకి వెళ్లిన మా కొడుకు కరెంట్ షాక్ తగిలి 80 శాతం గాయాలయ్యాయి. ప్రాణాలకు గ్యారంటీ లేదన్నారు. రూ.20లక్షలు అప్పు చేసి వైద్యం చేయించుకుని ప్రాణాలను కాపాడుకున్నాం. 'సెస్' సంస్థ ఒక్కపైసా పరిహారం కూడా ఇవ్వలేదు.

– ప్రణీత్ తల్లి, పదిర గ్రామం

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోలే రైతులు డబ్బులు కట్టాలా..



ట్రాన్స్‌పార్మర్ కాలిపోతే.. రైతులే మోటారు ఇంత అని డబ్బులు వసూలు చేసి 'సెస్' సిబ్బందికి ఇస్తున్నారు. 'సెస్'కు ఐదు వాహనాలు ఉన్నా ప్రైవేటు వాహనాల్లో ట్రాన్స్‌ఫార్మర్ తెస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్ పనిచేయదు. మీటింగ్‌ల సమాచారం ఇవ్వరు. విద్యుత్ ప్రజావాణి మొక్కుబడిగా నిర్వహించి ఫొటోలు దిగుతున్నారు. 'సెస్' సంస్థ రూ.కోట్ల అప్పుల్లో ఉంది. ఆస్తులను కోల్పోతుంది.

– జోగినిపల్లి సంపత్‌రావు, నర్సింగాపూర్

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు నష్టం



జిల్లాలో 140 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. 124 హెచ్‌పీల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారని హెచ్‌టీ బిల్లింగ్ చేస్తున్నారు. ఎల్‌టీ బిల్లింగ్‌ను హెచ్‌టీగా మార్చడంతో ఎక్కువ విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. దీన్ని సవరించాలని చెప్పినా 'సెస్' అధికారులు పట్టించుకోవడం లేదు. బిల్లు కట్టకుంటే డిస్‌కనెక్షన్ చేస్తున్నారు. దీంతో ఫుడ్ ప్రాసెస్ యూనిట్లకు నష్టం జరుగుతుంది. సిటిజన్ చార్టర్‌ను 'సెస్'లో అమలు చేయడం లేదు.

– గర్రెపెల్లి ప్రభాకర్, సిరిసిల్ల

సిబ్బంది పాతుకుపోయారు



సంస్థలో 20 ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగులు పాతుకుపోయారు. వారిని బదిలీ చేయకుండా ఉన్నతాధికారులు, పాలకవర్గం మీకు మేము.. మాకు మీరు అన్నట్లు గా వ్యవహరిస్తున్నారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ సమస్యలతో వస్తే అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. సరిగ్గా డ్యూటీలు చేయకుండా రూ.లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నారు. 'సెస్' సంస్థను ఎన్పీడీసీఎల్‌లో కలపాలి.

– దేవయ్య, ఎల్లారెడ్డిపేట

ముంపు గ్రామాల్లోని మెటీరియల్ ఏమైంది



మధ్యమానేరు ముంపు గ్రామాల్లోని రూ.కోట్ల విలువైన విద్యుత్ పరికరాలను అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. కేంద్రం అమలు చేస్తున్న గ్రీన్ ఎనర్జీ సోలార్ ఎనర్జీని 'సెస్' సంస్థ ఎందుకు ప్రోత్సహించడం లేదు. సంస్థ స్వయం సమృద్ధి సాధించడం లేదు. సిక్ యూనిట్లకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్లు చేసి మొండి బకాయిలను వసూలు చేయాలి. ఆదర్శ 'సెస్'ను ఎన్పీడీసీఎల్‌లో కలపాలనే డిమాండ్ వస్తుందంటే పాలకవర్గం ఆలోచించాలి.

– పులి లక్ష్మీపతిగౌడ్, స్తంభంపల్లి

సేవా భావం లేదు



'సెస్' సంస్థలో ఒకప్పుడు సేవా భావం ఉండేది. ఇప్పుడు లేదు. 124 కేవీ విద్యుత్ రైస్ మిల్లులకు శాపంగా మారింది. నేను అదనంగా రూ.5లక్షలు చెల్లించాను. మా ఊరిలో బైరి దుర్గయ్య అనే దళితుడు రూ.7,600 చెల్లించి 2 పోల్స్ కావాలంటే ఇవ్వలేదు. కానీ అతని పేరిట మెటీరియల్ డ్రా చేశారు. దీనికి బాధ్యులు ఎవరు? ఊరిలో లోవోల్టేజీ సమస్య ఉందని, ఓ ట్రాన్స్‌ఫార్మర్ వేయాలంటే పట్టించుకోవడం లేదు. సంస్థలో పని చేసే వారు కరువయ్యారు.

– వెన్నమనేని వంశీకృష్ణరావు, మర్తనపేట

బ్యాక్ బిల్లింగ్‌ను రద్దు చేయాలి



పవర్‌లూమ్ పరిశ్రమలో బ్యాక్ బిల్లింగ్ పేరిట గతంలో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు బిల్లులు వేస్తున్నారు. ఒక్కో మరమగ్గాల పరిశ్రమ రూ.లక్షల్లో బ్యాక్ బిల్లులు పెండింగ్ ఉన్నాయని విద్యుత్ కట్ చేస్తున్నారు. పాతికేళ్లుగా అమలులో ఉన్న 50 శాతం విద్యుత్ రాయితీలో పరిశ్రమ నడిచింది. ఇప్పుడు కొత్తగా బ్యాక్ బిల్లింగ్ వేయడం సరికాదు. ఈఆర్సీ చొరవ చూపి బ్యాక్ బిల్లింగ్‌ను రద్దుచేసి వస్త్రపరిశ్రమను రక్షించాలి.

– తాటిపాముల దామోదర్, సిరిసిల్ల

అసెంబ్లీలో మనోళ్ల వాయిస్



ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం వినిపించారు. తమతమ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు.. కావాల్సిన నిధులు.. సదుపాయాలను గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఏమన్నారంటే..

ఎస్సీ బిల్లు హర్షణీయం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం రాష్ట్రప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. మందకృష్ణ మాదిగ సుమారు 30 ఏళ్లుగా అనేక పోరాటాలు చేశారు. గతంలో అనేకసార్లు హామీలు ఇచ్చినా వర్గీకరణకు ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకొచ్చి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం హర్షణీయం. ఈ బిల్లుతో ఎస్సీల్లోని అన్నివర్గాలకు మేలు జరుగుతుంది.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్

సాగునీటి పథకాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కవ్వంపల్లి

ఇల్లంతకుంట(మానకొండూర్): మానకొండూర్ నియోజకవర్గం పరిధి లోని ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రారంభమైన ఎల్ ఎం-6 కాలువ పనులు పూర్తి చేయాలని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల పరిధిలోని రైతులు రిలే దీక్ష చేస్తున్నారు. కాలువ ప్రభావిత గ్రామాలను సిరిసిల్ల, సిద్దిపేట ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. కాలువ పనులకు రూ.3.19 కోట్లు మంజూరు చేయాలి. నియోజకవర్గంలో ఒక హై లెవెల్ బ్రిడ్జి అవసరం ఉంది.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

దేశానికే రోల్‌మోడల్



మాట్లాడుతున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని అన్నింటా అగ్రగామిగా ముందుకు సాగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన చేపట్టి కాంగ్రెస్ పార్టీ చారిత్రక నిర్ణయం తీసుకుంది. అన్ని పార్టీల నిర్ణయంతో అసెంబ్లీలో కులగణనపై కేబినెట్ ఒక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అమలు చేసింది. దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ నిలిచింది.

– ఎంఎస్ రాజ్‌ఠాగూర్, రామగుండం ఎమ్మెల్యే

రాజన్న బోర్డు ఏర్పాటు చేయండి



ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజన్న ఆలయానికి బోర్డు, పట్టణంలో సాంస్కృతిక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. వేములవాడ ఆలయ ఆదాయం రూ.189 కోట్లుగా ఉంటుంది. గత ప్రభుత్వం రంగురంగుల బ్రౌచర్లలో అభివృద్ధి చూపించింది తప్ప ఒక్క ఇటుక కూడా కొత్తది పేర్చలేదు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెనక్కి వెళ్లిన రూ.20 కోట్ల వీటీడీఏ నిధులను తిరిగి తెప్పించి బద్దిపోచమ్మ ఆలయం వద్ద పనులు ప్రారంభించాం. రూ.35 కోట్లతో నిత్యాన్నదాన సత్రానికి శంకుస్థాపన చేశాం. ఆలయ నుంచి వెయ్యి మీటర్ల వరకు రెంతస్తుల భవనాల నిర్మాణం చేయకుండా జీవో తెచ్చారు. దాన్ని సవరించాలి.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కుక్కకాటుకు గురైన బాలికకు పరామర్శ



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: కుక్కకాటుకు గురై, గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. చిన్నబోనాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని గొట్టెముక్కల సువర్ణపై సోమవారం వీధికుక్క దాడి చేసింది. విద్యాలయం సిబ్బంది వెంటనే అప్రమత్తమై సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం విద్యార్థినిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని వార్డులను, బ్లడ్‌బ్యాంక్‌ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి

వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, వేసవి ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఇబ్బందులున్న ప్రాంతాలను ముందే గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. మిడ్‌మానేర్, అప్పర్‌మానేర్ నుంచి తాగునీరు వేములవాడలోని గుర్రంవానిపల్లి 120 ఎంఎల్‌డీ, గంభీరావుపేట మండలంలోని కోళ్లమద్ది 7 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నుంచి 300 ఆవాసాలకు నీటి సరఫరా జరుగుతుందని, 75 ఆవాసాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఆర్‌డీవో శేషాద్రి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఈఈలు జానకి, శేఖర్‌రెడ్డి, రాము, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేశ్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల సమాచారం ఇవ్వండి

వేములవాడఅర్బన్: ఎల్ఆర్ఎస్–2020 దరఖాస్తుదారులు సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడ నందికమాన్ ప్రాంతంలోని అంజన డెవలపర్స్‌కు సంబంధించిన శ్రీనివాస్ తన వెంచర్‌లో మొత్తం 11.25 ఎకరాల భూమి ఉండగా, అందులో 117 ప్లాట్స్ చేశారు. 1.06 ఎకరాలు పార్క్ కోసం వదిలినట్లు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ వెంచర్‌ను జిల్లా కలెక్టర్, ఎల్ఆర్ఎస్ జిల్లా చైర్మన్ సందీప్‌కుమార్ ఝా, కమిటీ సభ్యులు ఆర్డీవో రాజేశ్వర్, పీఆర్, ఆర్అండ్‌బీ ఈఈలు, నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, డీటీసీపీవో అన్సర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

తొమ్మిది మంది తహసీల్దార్ల బదిలీలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలు జారీ

సిరిసిల్ల: జిల్లాలో ఏకకాలంలో తొమ్మిది మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ.. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఆదేశాలు జారీచేశారు. వేములవాడ తహసీల్దార్ ఎస్.మహేశ్‌కుమార్‌ను సిరిసిల్ల తహసీల్దార్‌గా, సిరిసిల్ల తహసీల్దార్ ఎం.ఉమారాణిని వేములవాడ ఆర్డీవో ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బదిలీచేశారు. వేములవాడ ఆర్డీవో ఆఫీస్ డీఏవో బి.వరలక్ష్మిని కోనరావుపేట తహసీల్దార్‌గా నియమించారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ బి.రామచంద్రంను కలెక్టరేట్–డీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, వేములవాడరూరల్ తహసీల్దార్ డి.సుజాతను ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌గా బదిలీ చేశారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో డీఏవోగా పనిచేస్తున్న ఎండీ అబూబాకర్‌ను వేములవాడరూరల్ తహసీల్దార్‌గా నియమించారు. కోనరావుపేట తహసీల్దార్ కె.విజయప్రకాశ్‌రావును వేములవాడ తహసీల్దార్‌గా, వీటీఏడీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేసే ఎస్.స్వాతిని సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. గంభీరావుపేట తహసీల్దార్ ఎల్.భూపతిని వేములవాడ వీటీఏడీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు. ఈమేరకు కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాంరెడ్డి ప్రొసీడింగ్ నంబరు ఏ1/390/2025 తేదీ: 18.03.2025ను జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ఆదేశాల్లో పేర్కొన్నారు.

విద్యతోనే విచక్షణ

- డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యతోనే విచక్షణ, జ్ఞానం వస్తాయని డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పదో తరగతి వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యతోనే జీవితాన్ని సరైన దిశలో మలుచుకునే అవకాశం లభిస్తుందన్నారు. వ్యక్తిగత జీవితంతోపాటు సమాజ వికాసానికి దోహదపడుతుందన్నారు. ఇష్టపడి చదివితే విజయాలు దరిచేరుతాయని పేర్కొన్నారు. హెచ్ఎం మోతిలాల్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఉమా, మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, స్టాఫ్ సెక్రెటరీ మల్లేశం పాల్గొన్నారు.

అన్నం పెట్టిన అమ్మలకు చిరుకానుక



జిల్లెల్లలో మధ్యాహ్నం వంట నిర్వాహకులకు చీరలు బహూకరిస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమకు ఇన్నాళ్లు పాఠశాలలో రుచికరమైన మధ్యాహ్నా భోజనం వండి పెట్టిన అమ్మలకు మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులు కృతజ్ఞతను చాటుకున్నారు. తమకు ఆరో తరగతి నుంచి రుచికరమైన భోజనం వండి పెడుతున్న మధ్యాహ్నా భోజనం నిర్వాహకులకు మంగళవారం చీరలు బహూకరించి తమ ప్రేమను చాటారు. విద్యార్థులు మాట్లాడుతూ ఐదేళ్లుగా తమను కన్నతల్లి లాగా చూసుకొని కడుపు నిండా అన్నంపెట్టారని కొనియాడారు. అనంతరం ఆఫీస్ సబార్డినేట్ సంతోష్‌కు కూడా బహుమతులు అందజేశారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జోగినపల్లి అనురాధ అభినందించారు.

బీసీ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలి

- అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదంపై హర్షం
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



అభివాదం చెబుతున్న నాయకులు

సిరిసిల్ల: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 29 నుంచి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ఆమోదం పొందడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు హర్షం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో మంగళవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. హన్మాండ్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని కోరారు. చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించకుంటే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. అనంతరం స్వీట్లు పంచి, టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. నాయకులు తడక కమలాకర్, బొప్ప దేవయ్య, చొక్కాల రాముముదిరాజ్, గోలి వెంకటరమణ, జగ్గాని మల్లేశ్‌యాదవ్, సమ్మెట రవి, ఇల్లంతకుంట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లలో శాస్త్రీయతను పాటించాలి

బీసీ రిజర్వేషన్లలో శాస్త్రీయతను పాటించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఆమోదించడంపై హర్షం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం కూడా బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరారు.

క్లుప్తంగా

ఏక్ భారత్.. శ్రేష్ట భారత్



వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏక్ భారత్.. శ్రేష్ట భారత్‌లో భాగంగా మంగళవారం వేషధారణలతో పాఠశాలకు హాజరయ్యారు. హెచ్ఎం శ్రీకాంత్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వీసు పర్సన్ సస్పెన్షన్

చందుర్తి(వేములవాడ): మండలంలోని నర్సింగపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వీసు పర్సన్‌గా పనిచేస్తున్న బండి రాకేశ్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు మండల విద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. పాఠశాల ఆవరణలో మద్యం తాగుతూ విద్యార్థులను చెడు వ్యసనాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణల మేరకు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇటలీలో ఎల్లారెడ్డిపేట వాసి మృతి



రషీద్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధి కోసం ఇటలీ దేశానికి వెళ్లిన ఓ వలస జీవి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన స్వగ్రామంలో విషాదం నింపింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన మహ్మద్ రషీద్(47) రెండేళ్ల క్రితం ఇటలీకి వెళ్లాడు. కారు డ్రైవింగ్ చేస్తుండగా ప్రమాదానికి గురై సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం అక్కడి మిత్రులు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా మంగళవారం సమాచారం అందించారు. రషీద్ కుటుంబ సభ్యులు కొంతకాలంగా సిద్దిపేటలో ఉంటున్నారు. రషీద్ మృతదేహం బుధవారం ఎల్లారెడ్డిపేటకు రానుంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లి రహదారిలోని తెలంగాణ సోషల్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థినిలు క్రీడాపోటీల్లో ప్రతిభ చూపారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎస్‌వైకేఎస్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీలో రమ్య, శైలజ, శృతి, రోజా, గౌతమి, గీతాంజలి, శృతి, వాలీబాల్‌లో శ్రావణి, కీర్తి, వెన్నెల, శ్రీజ, ప్రవళ్లిక, నేహ, రన్నరప్ జట్టులో హారిక, మానస, కావ్య, శృతి, అఖిల, అక్షయ, మాళవిక, 200 మీటర్ల రేసులో వర్షిత, చైత్రిక విజయం సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, దేవిక, అభినందించారు.

దుబాయ్‌లో ఉద్యోగాలు.. ఐటీఐలో రిజిస్ట్రేషన్లు

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో నైపుణ్యం గల నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్ణయించింది. ఈమేరకు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్(దుబాయి)లో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సరిత ప్రకటనలో తెలిపారు. సిరామిక్ కాస్టర్‌జూనియర్ ప్రాసెస్ ఆపరేటర్, ప్రెస్ మెకానిక్, పాలిసింగ్ మెకానిక్, డిజైనర్, ప్రొడక్షన్ సూపర్‌వైజర్, బాడీ ప్రిపరేషన్ ఇన్‌చార్జ్, పోర్క్ లిఫ్ట్ ఆపరేటర్, షవల్ ఆపరేటర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు. తంగళ్లపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రిజిస్ట్రేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో లేదా 94400 49937లో సంప్రదించాలని సూచించారు.



విలాసాగర్ రెవెన్యూ పరిధిలో ఆగిన తవ్వకాలు



రత్నంపేట, దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లో వరదకాల్వ నిర్మాణం

అదనపు టీఎంసీ పనులపై అయోమయం

- ఏడాదిగా వీడని స్తబ్దత
- రూ.800 కోట్ల అంచనాలతో కాలువ పనులు
- 700 ఎకరాలు ముంపు
- నలభై శాతం మేర పనులు పూర్తి
- బడ్జెట్ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం మూడో టీఎంసీ వరదకాలువ పనులపై స్తబ్దత వీడడం లేదు. ఏడాదిగా అదనపు టీఎంసీ పనులు నిలిచిపోవడంతో దీని భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డ తర్వాత 2023 నవంబర్ నుంచి పనులు జరగడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వం కాలువ పనులు ఆపాలని, లేదా పనులు నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈక్రమంలో కొద్ది నెలల క్రితం దేశాయిపల్లి పరిసరాల్లో ఏర్పాటు చేసిన క్యాంపును సైతం ఎత్తేశారు. కరీంనగర్ జిల్లా రామడుగు, గంగాధర మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటరీ వరకు రూ.800 కోట్ల మేర అంచనాలతో 23 కిలోమీటర్ల మేర అదనపు టీఎంసీ వరదకాల్వ పనులకు మూడేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు.

వరదకాలువ పక్కకే 23 కిలోమీటర్ల అదనపు కాలువ

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం శ్రీరాములపల్లి 99 కిలోమీటర్ల వరదకాలువ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వరదవెల్లి 122 కిలోమీటర్ల మిడ్‌మానేరు ప్రాజెక్టు క్రాస్ రెగ్యులేటరీ వరకు 23 కిలోమీటర్ల మేర నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాల మీదుగా ప్రస్తుతం ఉన్న వరద కాల్వ పక్కకు అదనపు టీఎంసీ వరదకాలువ నిర్మిస్తున్నారు. అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో మూడు మండలాల రైతులకు చెందిన 700 ఎకరాల భూమి ముంపునకు గురికానుంది. ఇప్పటి వరకు 600 ఎకరాల మేర రైతుల నుంచి భూసేకరణ చేశారు. రైతులకు రూ.100 కోట్ల మేర పరిహారం డబ్బులు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. కొంతమంది రైతులకు పరిహారం డబ్బులు మరికొందరికి స్ట్రక్చర్స్ పరిహారం రావాల్సి ఉంది.

రెండు ప్యాకేజీలుగా అదనపు టీఎంసీ పనులు

అదనపు టీఎంసీల కాల్వ నిర్మాణం పనుల టెండర్లను రెండు ప్యాకేజీలుగా విభజించారు. రామడుగు మండలం శ్రీరాములపల్లి 99 కిలోమీటర్ల నుంచి 113 కిలోమీటర్ల వరకు ఒక ప్యాకేజీ, 113 కి.మీ నుంచి 122 కి.మీ వరకు రెండో ప్యాకేజీగా నిర్ణయించారు. సుమారు 120 నుంచి 160 మీటర్ల వెడల్పుతో పాత వరదకాలువను ఆనుకునే ఎడమ వైపు అదనపు టీఎంసీ వరదకాలువను నిర్మిస్తున్నారు. రెండు ఏజెన్సీలు గతంలో పనులు చేశాయి. ఇప్పుడు ఉన్న వరదకాల్వలో సుమారు రెండు టీఎంసీల మేర నీరు నిల్వ ఉంటుంది. అదనంగా మరో టీఎంసీ నీటి నిల్వ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఆలోచనతో నూతన కాల్వ నిర్మాణం పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించారు.

మెజార్టీగా అదనపు కాలువ తవ్వకాలు

అదనపు టీఎంసీ వరదకాలువ పనులు సుమారు 23 కిలోమీటర్ల మేర చేపట్టాలి. ఇందులో 16 కిలోమీటర్ల మేర కాలువ పనులు ప్రారంభించారు. ఇందులో 4 కిలోమీటర్ల మేర పూర్తిగా తవ్వారు. శ్రీరాములపల్లి, కొండన్నపల్లి, కురిక్యాల, విలాసాగర్ గ్రామాల్లో మరో ఏడు కిలోమీటర్ల మేర పనులు ప్రారంభించాల్సి ఉంది. ఎర్త్ వర్క్ మొత్తం ప్రారంభమైంది. స్ట్రక్చర్స్(బ్రిడ్జిల) నిర్మాణం, విలాసాగర్ చెరువులో నీళ్లలో 3 బ్రిడ్జిల నిర్మాణం పనులు మొదలుకాలేదు. కాగా అదనపు కాలువ లోతు సుమారు 34 మీటర్లు, వెడల్పు 80 నుంచి వందకుపైగా మీటర్ల మేర ఉంటుంది. అదనపు టీఎంసీ వరద కాలువ పనులు మొదలైన ప్రాంతాల్లో 40 శాతం మేర పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. బోయినపల్లి మండలం దేశాయిపల్లిలో ముంపు ఇళ్ల ప్రాంతం, బీటీ రోడ్డు ఏరియాలో పనులు మొదలుకాలేదు.

రాష్ట్ర బడ్జెట్ అనంతరం స్పష్టత

రెండేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అదనపు వరద కాలువ పనులు వద్దని అప్పుడు ఆందోళనలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పనులు తిరిగి ప్రారంభం కావడంలో అయోమయం నెలకొంది. 2025 రాష్ట్ర బడ్జెట్ తర్వాత అదనపు టీఎంసీ కాలువ పనులపై ప్రభుత్వ వైఖరి తెలుస్తోందని భావిస్తున్నారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేస్తే పనులు ముందుకు సాగే అవకాశం కనిపిస్తుంది. రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించింది. పనులు వద్దని విలాసాగర్ గ్రామస్తులు 200 రోజులు రిలేదీక్షలు చేసినా ఎల్ఏవో, ఆర్డీవోలు, తహసీల్దార్లు రైతులను బుజ్జగించి పనులు జరిగేలా ఒప్పించారు. ప్రస్తుతం ఏడాదికి పైగా అదనపు టీఎంసీ పనులపై స్పష్టత రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



విలాసాగర్ గ్రామంలో 10 మార్చి 2022లో అదనపు కాలువ వద్దని రైతులు చేపట్టిన రిలే దీక్షలకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు

అదనపు టీఎంసీ వరదకాల్వ స్వరూపం
కాలువ నిర్మాణం : 23 కిలోమీటర్లు
గతంలో వేసిన అంచనాలు : రూ.800 కోట్లు
సేకరించిన భూమి : 600 ఎకరాలు
రైతులకు అందిన పరిహారం : రూ.100 కోట్లు
పూర్తయిన పనుల విలువ : రూ.100 కోట్లు

పంట.. పశువులకు మేత



కోనరావుపేట(వేములవాడ): రైతులు ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంట పశువులకు మేతగా మారింది. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. రైతులు చేసేదమి లేక పంటలను వదిలేస్తున్నారు. కోనరావుపేట మండలం ధర్మారం శివారులో నీరందక ఎండిపోయిన చేనులో మేకలు, గొర్లు మేస్తున్నాయి.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

- సైకాలజిస్ట్ కె.పున్నంచందర్
- నేతన్నలకు సామూహిక కౌన్సెలింగ్



నేత కార్మికులక సామూహిక కౌన్సెలింగ్

సిరిసిల్ల: నేతకార్మికులు దురలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి ఆహారం తీసుకుంటూ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ పున్నంచందర్ సూచించారు. స్థానిక కార్మికవాడలో జిల్లా జనరల్ ఆస్పత్రి మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక కౌన్సెలింగ్ నిర్వహించారు. పున్నంచందర్ మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలన్నారు. పవర్‌లూమ్ కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించేందుకు మహిళాశక్తి చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చిందని వివరించారు. నేతన్నలు మానసిక, శారీరక ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. తంబాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. మరమగ్గాల పారిశ్రామికులు దూస ప్రసాద్, మైండ్ కేర్ సిబ్బంది వేముల అన్నపూర్ణ, రాపెల్లి లత, కొండ ఉమ, బూర శ్రీమతి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లలోకి ప్రవేశించిన లబ్ధిదారులు



డబుల్ బెడ్‌రూమ్‌లలోకి వెళ్లన లబ్ధిదారులు

ఇల్లంతకుంట(మానకొండూర్): తమకు డబుల్ బెడ్‌రూము ఇళ్లను అధికారులు ఇచ్చేలా లేరనుకుని మండల కేంద్రానికి చెందిన 10 మంది లబ్ధిదారులు మంగళవారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి ప్రవేశించారు. ఇళ్లకు అధికారులు వేసిన తాళాలు పగులకొట్టి వెళ్లారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ఇళ్లు కేటాయించిన అధికారులు ఇప్పటి వరకు అప్పగించలేదన్నారు. సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. అద్దె ఇళ్ల ఇబ్బందులు తప్పించుకునేందుకు తాము తమకే వచ్చి, ఖాళీగా ఉంటున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వెళ్లినట్లు చెప్పారు.

'డబుల్' ఇళ్ల పరిధిలో 163 సెక్షన్ అమలు

ఇల్లంతకుంటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి ఎవరూ వెళ్లకూడదని, ఆ ప్రాంతంలో 163 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ ఫారుఖ్ మంగళవారం రాత్రి ప్రకటనలో తెలిపారు. ఆ ఇళ్ల చుట్టుపక్కల కూడా ఎవరూ ఉండకూడదని పేర్కొన్నారు.

న్యాయం చేయండి

- మండుటెండలో ఆరుగంటల పాటు ధర్నా
- పోలీసుల హామీతో విరమణ



పోలీస్ స్టేషన్ ఎదుట మృతుని కుటుంబీకులు

బోయినపల్లి(చొప్పదండి): ఇల్లు లేదు. భూమి లేదు.. బతుకుదెరువు లేదు.. ఇంటి పెద్ద చనిపోయాడు.. మాకు న్యాయం చేయండి సారు.. అంటూ ట్రాక్టర్ ఢీకొని సోమవారం రాత్రి మృతి చెందిన సురకాని మల్లేశం కుటుంబీకులు, బంధువులు మంగళవారం బోయినపల్లిలో ధర్నాకు దిగారు. మృతుడి భార్య గంగాజల ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి ఎండలో బైటాయించడం చూసేవారిని కంటతడి పెట్టించింది. గంగాధర మండలం ఉప్పరమల్యాలకు చెందిన మల్లేశం కొంతకాలంగా బోయినపల్లిలో ఉంటూ గొర్రెలకాపరిగా ఉపాధి పొందుతున్నాడు. గొర్రెలమంద వద్దకు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని మృతిచెందాడు. ఈక్రమంలో తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానిక పోలీసుస్టేషన్ వద్దకు మృతుని కుటుంబసభ్యులు, బంధువులు చేరుకున్నారు. ప్రమాద కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేయాలని కోరారు. అక్కడి నుంచి బోయినపల్లి-గంగాధర ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. వేములవాడ రూరల్, టౌన్ సీఐలు శ్రీనివాస్, వీరప్రసాద్, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, మారుతితో పాటు దాదాపు 50 మంది సిబ్బంది అక్కడికి చేరుకొని బందోబస్తు చేపట్టారు. దాదాపు ఆరు గంటల పాటు ధర్నా కొనసాగింది. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి సైతం సంఘటన స్థలం వద్దకు వచ్చి వాకబు చేశారు. చివరికి సాయంత్రం ఆరు గంటల సమయంలో చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని పోలీసుల హామీతో ధర్నా విరమించారు.

నకిలీ సర్టిఫికెట్లు సృష్టించిన ఇద్దరి రిమాండ్

ఇల్లంతకుంట(మానకొండూర్): నకిలీ వైద్య సర్టిఫికెట్లను తయారుచేసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి, మరో రిటైర్డ్ ఉద్యోగిలను మంగళవారం మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. గాలిపెల్లి పశువైద్యశాలలో కత్తి దేవమ్మ ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా రిటైర్డ్ అయి తన కూతురుకు ఉద్యోగం పెట్టించాలని భావించింది. ఈక్రమంలో చింతకుంటకు చెందిన వెటర్నరీ రిటైర్డ్ ఉద్యోగి జేరిపోతుల సంజీవ్‌ను సంప్రదించింది. సంజీవ్ ఆమె వద్ద రూ.32వేలు తీసుకుని మరొకరి వద్ద నకిలీ మెడికల్ బిల్లులు తెచ్చిచ్చాడు. వాటిని దేవమ్మ కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకుంది. ప్రభుత్వ అధికారుల పరిశీలనలో నకిలీవని తేలడంతో కేసు పరిశీలించాల్సిందిగా ఇల్లంతకుంట ఎస్సైకి సమాచారం ఇచ్చారు. కత్తి దేవమ్మ, జేరుపోతుల సంజీవ్ నకిలీ మెడికల్ బిల్లులు సృష్టించినట్లు పోలీసుల విచారణలో నిర్ధారణ కావడంతో ఇద్దరిని రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో గాలిపెల్లి పశువైద్యశాల డాక్టర్ కొండ ఇందిరా ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

థాయ్‌లాండ్‌కు మరో విమానం

- బాధితులను తీసుకొచ్చేందుకు పంపనున్న కేంద్రం

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కొలువుల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ పరిసర దేశాల్లో సైబర్ కేఫ్‌ల్లో చిక్కుకున్న యువతను ఇండియాకు తీసుకొచ్చే ఆపరేషన్ కొనసాగుతోంది. ఇటీవల అక్కడ చిక్కుకున్న యువత దయనీయస్థితిని 'సాక్షి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు. అమిత్‌షా ఆదేశాలతో మయన్మార్, థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న 540 మంది భారతీయులను రెండు సైనిక విమానాల్లో సురక్షితంగా ఢిల్లీకి తరలించారు. వారిని సీబీఐ, ఎన్ఐఏ, ఐబీ దర్యాప్తు సంస్థలు విచారించిన అనంతరం స్వరాష్ట్రాలకు పంపారు. తాజా సమాచారం ప్రకారం.. మరికొందరు భారతీయ యువతీ, యువకులు ఇంకా అక్కడ చిక్కుకుపోయారని, వారిని కూడా రక్షించేందుకు కేంద్ర హోంశాఖ మరో విమానాన్ని థాయ్‌లాండ్‌కు పంపనుందని సమాచారం. ఈ వారాంతంలోగా మరో విమానం ద్వారా వారిని తీసుకురానున్నారని తెలిసింది.

మహిళ మెడలోంచి చైన్ చోరీ

మెట్‌పల్లిరూరల్: ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన ఓ మహిళ మెడలో నుంచి దుండగుడు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన మెట్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం మునిపల్లికి చెందిన దొడ్డ రమ్య, నర్సయ్య దంపతులు మంగళవారం వెల్లుల ఎల్లమ్మ తల్లి ఆలయానికి వచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని వంట చేసుకునే క్రమంలో వెల్లుల వైపు నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగుడు రమ్య మెడలోని రెండున్నర తులాల బంగారు ఆభరణాలను లాక్కెళ్లాడు. భక్తుల సమాచారంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది ఆలయం వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

25న ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు

- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు

సిరిసిల్ల: ప్రభుత్వ పథకాలపై కలెక్టరేట్‌లో ఈనెల 25న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి.హనుమంతు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ), ప్రధానమంత్రి విశ్వకర్మ (పీఎంవీకే), ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ), ప్రధాన మంత్రి ఫోర్మాలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ స్కీం(పీఎంఎఫ్ఎంఈ), ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీం (పీఎంఐఎస్)లపై అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ సదస్సులో డీఆర్‌డీఏ పీడీ, జిల్లా ఉపాధి కల్పన అధికారి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొంటారని తెలిపారు.

బీసీ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ హకీంపేటలో నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీడీవో రాజమనోహర్ ప్రకటనలో తెలిపారు. లైట్ అండ్ హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్‌లో ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 38 రోజుల శిక్షణ అనంతరం ఉచితంగా శాశ్వత లైసెన్స్ జారీ చేస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. 45 ఏళ్లలోపు వయసు, రూ.2లక్షల లోపు వార్షికాదాయ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, కనీసం 8వ తరగతి ఉత్తీర్ణత గల వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30లోపు తమ దరఖాస్తులను జిల్లా బీసీడీవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.





దేవతలారా రండి..

- ఆకట్టుకున్న వీరశైవుల ఖడ్గాలు
- నేడు రాజన్న రథోత్సవం

వేములవాడ: రాజన్న ఆలయంలో జరుగుతున్న శివకల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం వీరశైవులు దేవతలను ఆహ్వానించే ప్రక్రియలో భాగంగా వేసిన ఖడ్గాలు ఆకట్టుకున్నాయి. వీరశైవుల హావభావాలు, శరభ..శరభ అంటూ వేసిన స్టెప్పులతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. దాదాపు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీఐపీల తాకిడి పెరగడంతో క్యూలైన్లలో భక్తులకు ఎదురుచూపులు తప్పలేదు. నేడు రథోత్సవం నిర్వహించనున్నారు.



కలెక్టరేట్ సర్కిల్ ప్రాంగణంలో స్కార్ఫ్ ధరించిన మహిళలు



గాంధీ ఏరియాలో బైక్‌పై వెళ్తున్న వృద్ధుడు



మార్కెట్‌లో గొడుగు నీడన దోసకాయలు అమ్ముతున్న మహిళా రైతు

ఎండలు మండుతున్నాయ్

మార్చి మూడో వారంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయిలో ఉంటుండడంతో అత్యవసర పనులు ఉన్న వారే బయట కనిపిస్తున్నారు. వారు కూడా తలపై తువ్వాలు, గొడుగులతోనే వస్తున్నారు. సిరిసిల్ల రోడ్లపై జనసంచారం పెద్దగా లేకపోవడంతో పలు వ్యాపారాలు నెమ్మదిగా సాగాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



నెత్తిపై తువ్వాలతో..